జిల్లా వ్యసాయాధికారి శ్రీధర్ బదిలీ

కరీంనగర్ టౌన్, జనవరి 29: జిల్లా వ్యవసాయాధికారి వాసిరెడ్డి శ్రీధర్ టీఎస్ ఆయిల్ ఫెడ్ ఓఎస్డీగా బదిలీపై వెళ్లారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియదర్శినికి జిల్లా వ్యవసాయ అధికారిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆమె జిల్లా వ్యవసాయ అధికారిగా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు రణధీర్‌కుమార్, కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారులు సత్యం, రంజిత్, ఏడీఏ ట్రైనింగ్ అంజని, సాంకేతిక వ్యవసాయ అధికారులు ఎం.కృష్ణ, కె.స్వప్న, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జ్యోతి పాల్గొన్నారు.

మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

సుభాష్‌నగర్, జనవరి 29: పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్, ఫీజు రీ యింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలంగా వసతి గృహాలు, గురుకులాలు, కెజీబీవీ, ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన మెస్ బిల్లులు 6,300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని విడుదల చేయాలని గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు కూడా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదన్నారు. దీంతో పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి అందడం లేదన్నారు. ఆరు సంవత్సరాలుగా రాష్ట్రంలో రూ. 7200 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీ యింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని విడుదల చేయాలని అనేక మార్లు ఉద్యమాలు చేసినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే వాటికి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు తిప్పారపు రోహిత్, అభిలాష్, జిల్లా కమిటీ సభ్యుడు రత్నం సురేష్, శివ, ఇషాక్, బొగేష్, రాకేష్, చందు, సుధీర్, అరవింద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు చేయూత పెన్షన్లను ఇప్పించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 29: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు చేయూత పథకం ద్వారా పెన్షన్ ఇప్పించాలని ఆ సంఘం అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గడప కోటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో కంటి డాక్టర్‌ను నియమించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, రాములు, వీరేశం, దామోదర్ పాల్గొన్నారు.

ఇద్దరికి కరోనా

సుభాష్‌నగర్, జనవరి 29: జిల్లా ఆసుపత్రిలో రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. సోమవారం లక్షణాలు ఉన్న ఓపీ పేషంట్లకు పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి కరోనా సోకినట్లు నిర్ధారణ అయ్యిందని చెప్పారు.

వాడీవేడిగా..

- బల్దియా సర్వసభ్య సమావేశంలో సమస్యలపై నిలదీత
- గళమెత్తిన అధికార, ప్రతిపక్ష సభ్యులు
- అవినీతిపై విచారణ కమిటీ వేయాలని బీజేపీ కార్పొరేటర్ నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ సునీల్ రావు, హాజరైన కార్పొరేటర్లు

కరీంనగర్ టౌన్, జనవరి 29: అసంపూర్తి పనులు, స్మార్ట్‌సిటీ పనుల్లో అక్రమాలు, ఇతర సమస్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు గళమెత్తడంతో బల్దియా సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ యాదగిరి సునీల్ రావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

అద్భుతంగా అభివృద్ధి చేశాం..

- మేయర్ సునీల్‌రావు

ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ 30 ఏళ్లలో జరుగని అభివృద్ధి తమ పాలకవర్గం హయాంలో జరిగిందన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలుపుకున్నా మని అన్నారు. యూజీడీతో పందుల బెడద తగ్గిందని, 36 లక్షలతో వీధికుక్కలకు బర్త్‌కంట్రోల్ ఆపరేషన్లు చేయించామని, 20 లక్షల ఖర్చుతో 2,400 కోతులను పట్టించి అటవీప్రాంతంలో వదిలి వేయించామన్నారు. వన్‌టౌన్ ఎదురుగా ఉన్న జంక్షన్‌ను సుందరీకరించి తెలంగాణతల్లి, చొక్కారావు విగ్రహాలను యథాస్థానంలో ఏర్పాటు చేస్తామని సునీల్‌రావు ప్రకటించారు. 132 కోట్ల సీఎం అస్యూరెన్సు నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇంకా పూర్తి కానీ పనులను కూడా పాలకవర్గ పదవీకాలం ముగిసే ఏడాదిలోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. కార్పొరేటర్లు ప్రస్తావించిన సమస్యలన్నింటిని పరిష్కరిం చాలని ఆదేశించారు.

● తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడ పెట్టారు..

మాజీ మేయర్, బీఆర్ఎస్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష తెలంగాణ తల్లి విగ్రహమని, తెలంగాణతల్లి విగ్రహాన్ని ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. ఓ ఆంధ్రా అధికారి ఉద్దేశపూర్వకంగానే విగ్రహ నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తున్నారని, అనేక అవకతవకలు జరిగాయని, సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణతల్లి విగ్రహాన్ని అదే స్థానంలో ఏర్పాటు చేయక పోతే ఉద్యమకారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఇళ్ళు ముట్టడిస్తామని హెచ్చరించారు. స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పనుల్లో తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించిన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులను అగౌరవపరిచే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమాల సమాచారాన్ని ఇవ్వడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

● ఆరోపణలు వచ్చిన కార్పొరేటర్లను బర్తరఫ్ చేయాలి

బీజేపీ కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్ కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ నిధులను విడుదల చేసినా కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా ఆలస్యం చేసిందని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మొన్నటి వరకు స్క్రాప్ అని సంబోధిస్తూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన చేపట్టారని, ఇప్పుడు ఆయన వద్దకు నిధుల కోసం ఎలా వెళ్తారని ప్రశ్నించారు. భూకబ్జాలకు పాల్పడినట్లు ఆరోపణలతో జైలుకు వెళ్లిన కార్పొరేటర్లను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సెప్టిక్ ట్యాంకర్ క్లీనర్లు అడ్డగోలుగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. తన డివిజన్ పరిధిలోని శ్రీరామాబుక్‌డిపో ముందు రోడ్డు ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలని, టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డుతో పోడియం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మేయర్ సునీల్‌రావు హామీతో ఆందోళన విరమించారు.

- ■ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకటో డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లిలో నాలుగేళ్ళ నుంచి తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. సొంత డబ్బులతో ట్యాంకర్లతో తాగునీటిని ప్రజలకు అందిస్తున్నానని, ఈవేసవిలోగానైనా పైపులైను పనులు పూర్తిచేసి తాగునీటిని అందించాలని కోరారు.
- ■ వావిలాలపల్లిలో ఐదు నెలల క్రితం రోడ్డు వేసేందుకు తవ్వి వదిలిపెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు కావాలని రోడ్డు వేయడం లేదని కార్పొరేటర్ బండారి వేణు ఆరోపించారు.
- ■ ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి చేశామని, డీజీల్ సమస్యలతో పారిశుధ్య పనులు సరిగా జరుగడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ కోరారు.
- ■ డంపుయార్డులో చెత్త గుట్టల్లా పేరుకుపోయిందని, బయో మైనింగ్ నామమాత్రంగానే జరుగుతుందని, డంపుయార్డు సమస్య నుంచి డివిజన్ ప్రజలకు విముక్తి కలిగించాలని ఐలేందర్ యాదవ్ కోరారు.
- ■ ఇంటి నంబర్ల సమస్యలను పరిష్కరించాలని, దోమలబెడద తీవ్రంగా ఉన్నందున ఫాగింగ్ జరిపించాలని కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ కోరారు.
- ■ ప్రభుత్వ భూముల్లోని అక్రమ కట్టడాలపై తమపై అసత్య ఆరోపణలు వస్తున్నాయని, మేయర్ చొరవ తీసుకొని వాటిపై విచారణ జరిపించి ప్రభుత్వ భూములను కాపాడాలని కార్పొరేటర్ సుధగోని మాధవికృష్ణ కోరారు.
- ■ ఓపెన్ జిమ్ముల పరికరాలు చెడిపోతున్నందున వాటికి మరమ్మతు చేయించాలని, వీధికుక్కల బెడదను తగ్గించాలని కార్పొరేటర్ దిండిగాల మహేశ్ కోరారు.
- ■ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, గందెమాధవిమహేశ్, గంట కల్యాణి శ్రీనివాస్ తదితరులు వారి డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ బి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ అభివృద్ధికి కృషి

- బీఆర్ఎస్ హయాంలోనే సర్పంచులకు అన్యాయం
- మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 29: ఢిల్లికి రాజైన తల్లికొడుకేనని... తాను మంత్రిని అయినప్పటికి హుస్నాబాద్ నియోజకవర్గ బిడ్డనేనని, హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సైదాపూర్ మండలంలోని ఆరెపల్లిలో గ్రామ పంచాయతీ భవనం, రూ. 70 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు ఫోన్ చేసి అభివృద్ధిలో సహకరించాలని కోరానని తెలిపారు. కాని ఆయన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యే కేటీఆర్ సర్పంచులకు అన్యాయం జరిగితే ఊరుకోమని అంటున్నాడని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సర్పంచులకు అన్యాయం జరిగిందన్నారు. అది మరిచిపోయి కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. కారు షెడ్డుకు పోయిందని కేటీఆర్ అంటున్నాడని, షెడ్డుకు వెళ్లిన కారు తిరిగి రాకపోవచ్చన్నారు. బీఆర్ఎస్ నుంచి పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. కరీంనగర్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు వినోద్‌కుమార్ భయపడుతున్నాడన్నారు. ప్రభుత్వాన్ని కూలుస్తామంటున్న నాయకులు ఒళ్లు, నోరు దగ్గర పెట్టుకోవాలన్నారు. పార్లమెంటు ఎన్నికల తరువాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలు, మండలాలు, గ్రామాల పునర్విభజన ఉంటుదన్నారు. ఈ నెల 31తో సర్పంచుల పదవీ కాలం ముగుస్తుందని, ప్రత్యేకాధికారులతో ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. సర్పంచులు భయపడవద్దని, పెండింగ్ బిల్లులు తప్పకుండా చెల్లిస్తామన్నారు. కార్య క్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ నేరాల గోపాల్‌రావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు ఆవునూరి పాపయ్య, గాజర్ల సదానందం, చింత లత కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు బిల్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ గాజర్ల భాగ్య ఓదెలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దంత సుదాకర్, కాంగ్రెస్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మ్యాకల రవిందర్, పోగు రమేష్, జున్నూతుల భాస్కర్‌రెడ్డి, లంకదాసరి మల్లయ్య పాల్గొన్నారు.



సైదాపూర్ మండలం ఆరెపల్లిలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మూడో స్థానమే

- సర్పంచుల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

కరీంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మూడో స్థానంలో నిలుస్తుందని బీజేపీ జాతీయప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని మహి ళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పది ఎంపీ స్థానాలు గెలుచు కుంటామ న్నారు. త్వరలోనే ఎంపీ అభ్యర్థులను బీజేపీ ప్రకటిస్తుందన్నారు. బీజేపీ దేశవ్యాప్తంగా 350కి పైగాస్థానాల్లో గెలువడం ఖాయమన్నారు. కేటీ ఆర్‌కు దమ్ముంటే ఏ గ్రామానికి ఎన్ని నిధులి చ్చారనే వివరాలను చెప్పాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధులను గ్రామాల్లో ప్రజలకు వివరిస్తామన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకు పోయేలా చేసిందన్నారు. కేంద్రం ఏ గ్రామానికి ఎన్ని నిధులు ఇచ్చిందో వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బిఆర్ఎస్ గ్రామాలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. దేవుడినే నమ్మని నాన్ లోకల్ వినోద్‌కుమార్‌కు ప్రజలు ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు. కరీంనగర్ ప్రజలను ఆయన ఏనాడు పట్టించుకోలేదన్నారు.రాష్ట్రంలో సర్పంచులు చేస్తున్న ఆందోళన న్యాయమైనదేనన్నారు. బీఆర్ఎస్ పార్టీకి సర్పంచుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలుచేసుకున్నార న్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సర్పంచులకు చేసిన మోసాలను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం దారి మళ్లించిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచుల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు.



గంగాధరలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

● 317జీవోతో ప్రభుత్వం ఉద్యోగుల జీవితాలు నాశనం చేసింది

గంగాధర: జీవో 317తో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాలను టీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిందని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. సోమవారం గంగాధర మండలం చర్లపల్లి(ఆర్)లో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే ఆలోచన గత ప్రభుత్వం ఏనాడు చేయలేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే తన ఎంపీ కార్యాలయంపై పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారన్నారు. 317జీవోను సవరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అనంతరం గంగాధరలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ ముగింపు వేడుకలకు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల ప్రభాకర్‌యాదవ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, వైద రామానుజం, పెరుక శ్రవణ్‌కుమార్, ఎడవెల్లి శశిధర్, రేండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

● అదనపు కలెక్టర్ కె లక్ష్మికిరణ్

కరీంనగర్ టౌన్, జనవరి 29: పటిష్టమైన ప్రజాస్వామానికి, సమర్థవంతమైన ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధంగా పనిచేస్తుందని అదనపు కలెక్టర్ కె లక్ష్మీకిరణ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్స్ డెమానిస్ట్రేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ జిల్లాలో ఓటరుకు తన ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యాలను కల్పించడం మాత్రమే కాదు, ఆ ఓటు హక్కును వినియోగించుకునే ఓటింగ్ యంత్రాలపై కూడా సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరముందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధులను చేసేందుకు జిల్లాలో ఈవీఎం, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్‌లతో కూడిన డెమానిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్లలో, కలెక్టరేట్‌లో కలిపి ఐదు డెమానిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. మిగిలిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో, కరీంనగర్‌లో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంతో పాటు కలెక్టరేట్‌లో అదనంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించి ఓటు హక్కును వినియోగించుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో సుధాకర్ పాల్గొన్నారు.



నారాయణపూర్ డెలివరీ సిస్టర్న్ నుంచి విడుదలవుతున్న నీరు

నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీరు

● హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

గంగాధర, జనవరి 29: నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. 20 రోజులుగా ఆయకట్టు రైతులు వేసిన పొలాలకు సాగునీరందడంలేదని ఆందోళన చెందారు. రెండు రోజులకోసారి పొలాలకు తడులందిస్తూ వరి ఎండిపోకుండా కాపాడుకున్నారు. గంగాధర చెరువు కట్ట మరమ్మతులు పూర్తవగా ఎల్లంపల్లి నీరు విడుదల చేసి రిజర్వాయర్‌ను నింపాలని రైతులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మూడు రోజుల క్రితం మేడారం పంపుహౌస్ పునర్నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని ఈఎన్‌సీని కోరారు. సోమవారం ఎల్లంపల్లి నీరు గంగాధర మండలం నారాయణపూర్ డెలివరీ సిస్టర్న్ నుంచి విడుదల కావడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, జనవరి 29: పెండింగ్‌లో ఉన్న ఆశా వర్కర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆశ వర్కర్లు కనీస వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఫిక్స్‌డ్ వేతనం కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. వేతనాలు నెలనెలా ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. జిల్లా వైద్యశాఖ అధికారులు ప్రతివారం ఏఎన్‌సీ టార్గెట్ పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆ టార్గెట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగవేని శారద, ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత, ఉపాధ్యక్షులు పద్మ, శోభ, శంకరమ్మ, సరిత, సహాయ కార్యదర్శులు శ్యామల, సదాలక్ష్మి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న ఆశా వర్కర్లు

ధర్మపురిలో సంకటహర చతుర్థి పూజలు


స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 29: ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెం ట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలి

గణేశ్‌నగర్, జనవరి 29: విద్యార్థులు పరిశోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. కళాశాలలో గణిత శాస్త్ర విభాగానికి సంబంధించిన విద్యార్థులు పలు అంశాలపై పరిశోధన చేసి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ రాజేష్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు గణితశాస్త్రంలో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్ర అధ్యయనం వలన సమాజానికి ఉపయోగకరమైన అంశాలను కనుక్కునే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై చక్కని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్

1న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జనవరి 29: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్షలను గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. ఏదైనా కారణం చేత కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోల్ ఎక్కే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీకి యత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 29: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయం, వేణుగోపాలస్వామి బాలాలయంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఏమీ లభించకపోవడంతో వెంట తెచ్చుకున్న పరికరాలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆల యానికి వెళ్లిన భక్తులకు ఇనుప చువ్వలు, పరిసర ప్రాంతాలు చిందరవందరగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రల నిపుణుల బృందం నమూనాలను సేకరించింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బాలరాజు యాదవ్ వివరాలు తెలుసుకున్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రెండు ఆలయాల పరిసరాల్లోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదని స్థానికులు పేర్కొన్నారు. పలువురు ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఘటనపై వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గంభీరావుపేట, జనవరి 29: గంభీరావుపేట మండలం పెద్దమ్మ సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వినోద్ (35)అనే వ్యక్తి బైక్‌పై పెద్దమ్మ మీదుగా సిరిసిల్ల వైపు వెళుతుండగా, గొల్లపల్లి నుంచి గోరంటాల మీదుగా గంభీరావుపేటకు వస్తున్న ప్యాసింజర్ ఆటో మూల మలుపు వద్ద ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న వినోద్ మృతి చెందగా, ఆటో డ్రైవర్ వెంకటేశంకు కాలు విరిగింది. దీంతో అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తజన సంద్రంగా వేములవాడ



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం



వాహనాలతో నిండిపోయిన గుడి చెరువు పార్కింగ్ స్థలం

● 50 వేలకు పైగా భక్తుల రాక

వేములవాడ, జనవరి 29 : దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజన సంద్రంగా మారింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు ప్రతి నిత్యం వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సుమారు 50 వేల మందికి పైగా భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన శ్రీ స్వామివారి దర్శనం రాత్రంతా కొనసాగగా సోమవారం రాత్రి వరకు భక్తులు నిరంతరాయంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి శ్రీ స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటలకు నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భూకబ్జాలపై కరీంనగర్‌లో ఫిర్యాదుల పర్వం

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో భూకబ్జాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదుల పర్వం కొనసాగుతున్నది. సోమవారం ఒక్క రోజే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 70 మందికిపైగా బాధితులు పోలీస్‌కమిషనర్‌ను కలిసి వారికి జరిగిన అన్యాయాలను వివరించి, ఫిర్యాదులు చేశారు. వీరందరి ఫిర్యాదులు స్వీకరించిన సీపీ ఫిర్యాదు తీవ్రతను బట్టి ఆయా ఠాణాలకు, ఏసీపీలకు విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. కొందరు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ ఆర్థిక సమస్యలపై కూడా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఫిర్యాదులు కూడా అధికంగా రావటంతో భూకబ్జాల కేసుల విచారణపై ప్రభావం పడే అవకాశముంది. భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులపై ఒక్కొక్కటిగా విచారణ చేపడుతున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు తప్పుడు డాక్యుమెంట్లు గుర్తించి వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినమీదట నిందితులు, వారికి సహకరించిన వివిధ శాఖల ఉద్యోగులు, కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని వేర్వేరుగా విచారిస్తున్నారు. నివేదికను తయారు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిసింది. సోమవారం కరీంనగర్‌లోని కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ తోపాటు మరో ఇద్దరిని మూడో ఠాణాకు పిలిపించి విచారించి పంపించినట్లు సీఐ వి శ్రీనివాస్ తెలిపారు. అశోక్‌నగర్‌కు చెందిన ఒక బాధితుడు తన భూమిని కొందరు కబ్జాచేశారంటూ పోలీస్‌కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో రికార్డులు, డ్యాకుమెంట్ల పరిశీలన, విచారణలో భాగంగా సదరు కార్పొరేటర్, మరో ఇద్దరిని పిలిపించి మాట్లాడి పంపించామని సీఐ తెలిపారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

● మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపం

కరీంనగర్ క్రైం, జనవరి 29: మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపం చెందిన కొత్తపల్లి మండలం చింతకుంటలోని గురుకుల కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న జనుప అక్షిత(17) హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.... జగిత్యాల జిల్లా మల్యాల మండలం మైనంపల్లికి చెందిన అక్షిత సాయంత్రం 7 గంటల వరకు తోటి విద్యార్థినిలతోనే కలిసి ఉంది. విద్యార్థినిలు భోజనానికి వెళ్లిన సమయంలో డ్రెస్ మార్చుకుని వస్తానని గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు గమనించి వార్డెన్, ఇతర సిబ్బందికి సమాచారం అందించారు. బలవంతంగా తలుపులు తెరచి ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ముందు అక్షిత సూసైడ్ లెటర్ రాసింది. తనకు కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చాయని బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో తన పేరును ఎక్కించారని, తను 7 గంటలకు డిన్నర్ తరువాత చనిపోతున్నానంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొంది.

కాగా కామర్స్‌లో తక్కువ మార్కులు వచ్చిన 15 మంది విద్యార్థినిల పేర్లను బెస్ట్ అచీవ్‌మెంట్ బుక్‌లో నమోదు చేశారని, ఈ ప్రక్రియ నిత్యం జరిగేదేనని తోటి విద్యార్థులు చెబుతున్నారు. మార్కులు తక్కువ వచ్చినందుకు అంతకు ముందే అక్షిత కన్నీళ్లపెట్టుకోగా తోటి విద్యార్థులు ఓదార్చినట్లు తెలిపారు. విద్యార్థిని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురి గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

కోనరావుపేట, జనవరి 29: బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డి.ఎస్.పి నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన మానక శంకర్ ఓ బాలికపై అత్యాచారయత్నం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై దర్యాప్తు నిర్వహించగా నిజం అని తేలడంతో ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 107మంది రైతులు 1,035క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 33క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి29: దేశవ్యాప్తంగా ఐఐటి, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలి విడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రలలో పరీక్షలు కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమేన్స్ డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వివేకనంద డిగ్రీ అండ్ పిజి కాలేజ్, వాణీనికేతన్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, జేఎన్‌టియుహెచ్ ఇంజనీరింగ్ మంథని పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుండి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,289 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 20మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 1,303 మందికి 1,282మంది విద్యార్థు లు పరీక్షకు హాజరు కాగా 21మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టిఏ సిటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి



శిబిరంలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోల్‌సిటీ, జనవరి 29: ఈపీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఈపీఎఫ్ఓ రీజినల్ కమిషనర్ తానయ్య సెల్వట్కార్ పేర్కొన్నారు. సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు సంయుక్తంగా నిధి ఆప్‌కే నిఖత్ 2.ఓ పేరుతో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఈపీఎఫ్ ఖాతాదారులుగా ఉన్న కార్మికులు తమ ఖాతా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా హెల్ప్‌డెస్క్ ద్వారా నమోదు చేసి పరిష్కరించారు. ఈ సందర్భంగా తానయ్య సెల్వట్కార్ మాట్లాడుతూ ఖాతాలో నిధి ఎంత ఎక్కువ ఉంటే ఖాతాదారులకు అంత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్, పదవీవిరమణ, పెన్షన్ అవసరాల నిమిత్తం రుణాలు, ఇతర ప్రయోజనాలకు సంబంధించి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఖాతాకు ఆధార్ లింకు చేయడం తప్పనిసరి అని, నామినీ పేరు చేర్చితే ఉద్యోగి మరణాంతరం వారి వారసులకు సొమ్ము సులభంగా బదిలీ అవుతుందన్నారు. ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థ కార్మికులకు అందిస్తున్న వైద్య సదుపాయం, బీమా సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేస్తూ నెలవారీగా జాప్యం లేకుండా సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ఖాతాదారులు తమ అవసరాలకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ సంస్థలు మున్సిపల్ కార్పొరేషన్‌లోనే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయని, కార్మికులకు ఏ సమస్యలు ఉన్నా ఇందులో పరిష్కరించుకోవాలని సూచించారు.

లింకు కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలి

● రామగుండం నీటిపారుదల శాఖ ఈఎస్సీ వెంకటేశ్వర్లు

ధర్మారం, జనవరి 29: మండలంలోని నంది రిజర్వాయర్ నుంచి ధర్మారం డీ83/బి ఎస్సారెస్పీ కాలువ లింకు కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రామగుండం నీటిపారుదల శాఖ ఈఎస్సీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నంది రిజర్వాయర్ నుంచి చేపట్టిన లింకు కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. వానాకాలం సీజన్ వరకు పనులన్నింటినీ పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఆయన సూచించారు. రిజర్వాయర్ నుంచి ధర్మారంలోని డి83/బి కాలువ వరకు లింకు కాలువ పనులను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్సారెస్పీ సీఈ సతీష్‌రాజుచంద్ర, డీఈ కుమార్, ఏఈలు ఉన్నారు.

టెండర్ల ద్వారా అంజన్నకు రూ.3.88 కోట్ల ఆదాయం

మల్యాల, జనవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న పలు దుకాణాలకు అధికారులు సోమవారం కరీంనగర్‌లోని దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. వచ్చే ఏప్రిల్ నుంచి మార్చి-2025 వరకు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు, ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నిర్వహించిన ఈ టెండర్ల ద్వారా దేవస్థానానికి రూ. 3,88,41,221 ఆదాయం సమకూరింది. గత ఏడాది రూ. 2,73,70,271 ఆదాయం సమకూరగా ప్రస్తుతం రూ. 1,14,70,950 ఆదాయం అధికంగా సమకూరింది. గతంలో కొండగట్టు దేవస్థానంలోనే టెండర్లు జరుగగా వ్యాపారుల కుమ్మక్కుతో పలుమార్లు వాయిదా పడుతుండడంతో ఈ సారి కరీంనగర్ ఏసీ కార్యాలయంలో నిర్వహించారు. దీంతో అన్నీ ఒకే రోజు ఖరారయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీ స్వామి, ఈవో వెంకటేష్, ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ అధికారులు ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభంపై సిఫార్సుల కమిటీ ఏర్పాటు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై సిఫార్సుల కమిటీని నియమించినట్లు ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. జీవో ఆర్‌టీ నంబర్ 4 ద్వారా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. సభ్యులుగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎ చంద్రశేఖర్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ప్రభుత్వ ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ పరిశ్రమల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, అగ్రికల్చర్, కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, నిజాం షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్‌లను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో సూచించింది.

షుగర్ ఫ్యాక్టరీ తెరిచే విధంగా చర్యలు

● ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 29: ఏడాది లోపే రాష్ట్రంలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినా దంతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలన కేవలం హామీలకే పరిమితమైందని ఆరోపించారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే తెరిపిస్తామని బీఆర్ఎస్ నాయ కులు హామీ ఇచ్చారన్నారు. ఇదే నినాదంతో ఎంపీగా కవిత విజయం సాధించిన 100 రోజుల్లోనే ప్రైవేటు పరంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ వా టా 51 శాతం తేల్చకుండానే ఉన్న ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేశా రన్నారు. తెలంగాణ ప్రజలపై లక్షల కోట్ల అప్పుల భారం మోపి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలకు మాజీ సీఎం కేసీఆర్ పూర్తిగా నైతిక బాధ్యత వహించాలన్నారు. కేసీఆర్ ఆరు నెలల్లో సీఎం అవుతారని అంటున్న కేటీఆర్ వాఖ్యలపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఎలా అవుతారో సమాధానం చెప్పాలన్నారు. పదేళ్ల అనుభవంలో కేటీఆర్ నేర్చుకుంది ఇదేనా అన్నారు. ఈ సమావే శంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు జువ్వాడి కృష్ణారావు, గాజెంగి నందయ్య, జున్ను రాజేందర్, మన్సూర్, దుర్గయ్య ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ గాంధీ భవన్ గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌కు చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలడని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. ఇందిరా భవన్‌లో ఆయన మాట్లాడారు. నిజామా బాద్ ఎంపీ అభ్యర్థిగా కవిత పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు.



కరీంనగర్‌లో ఆటోల నుంచి తొలగించిన అదనపు సీట్లు

ఓవర్‌లోడ్‌పై ఆటోల తనిఖీ

కరీంనగర్ క్రైం, జనవరి 29 : కరీంనగర్‌లో ప్రయాణికుల ఆటోలపై ట్రాఫిక్ పోలీసులు సోమవారం కొరడా ఝులిపించారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలను తనిఖీ చేసి డ్రైవర్ సీటుకు ఇరుపక్కల ఏర్పాటు చేసిన అదనపు సీట్లను, మ్యూజిక్ సిస్టంలు, ఇతర పరికరాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదన్నారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ సీఐ పర్స రమేష్, ఎస్ఐ రాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

-బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్

కరీంనగర్ క్రైం, జనవరి29: శాతవాహన విశ్వవిద్యాలయంలో 2021లో జరిగిన పేపర్ లీకేజీ కేసులో నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేష్‌గౌడ్ సోమవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని, దోషులను శిక్షిస్తామని చెప్పిన ఎస్‌యూ వీసీ మల్లేశ్ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ ఘటనతో మెరిట్ విద్యార్థులు మానసిక సంఘర్షణకు గురయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు విద్యా వ్యవస్థపై నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచిలో జరుగుతున్న అక్రమాలపై కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, రిజిస్ట్రార్‌లపై విచారణ జరిపించాలన్నారు. దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని శ్రీగౌరిపూజితను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 29: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఫిబ్రవరి మొదటివారంలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ అకాడమి విద్యార్థిని డి శ్రీగౌరిపూజిత ఎంపికైంది. ఈనెల 12 నుంచి 14 వరకు సిద్దిపేట జిల్లా కొండపాకలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం అల్ఫోర్స్ అకాడమిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆమెకు ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు.

ఐఎంఏ ఉత్తమ అధ్యక్షుడిగా డాక్టర్ రాంకిరణ్

సుభాష్‌నగర్, జనవరి29: ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ జాతీయస్థాయి ఉత్తమ అధ్యక్షుడిగా కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్ ఎంపికయ్యారని కరీంనగర్ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఐఎంఏ ఆధ్వర్యంలో వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించారని పేర్కొన్నారు. ఐఎంఏచే నిర్వహింపబడుతున్న ఆవో గావ్ చెలే వైద్య శిబిరాలు దేశంలోనే ఎక్కువగా నిర్వహించామన్నారు. అవార్డును అందుకున్న డాక్టర్ రాంకిరణ్‌ను ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళిప్రసాద్, డాక్టర్ బిఎస్‌రావు, డాక్టర్ విజయరావు, డాక్టర్ గుత్త సురేష్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ మహేశ్, డాక్టర్ విజయ్ తదితరులు సన్మానించారు.

'సామాన్యులకు అండగా మంత్రి పొన్నం ప్రభాకర్'

కరీంనగర్ అర్బన్, జనవరి29: మంత్రి పొన్నం ప్రభాకర్ సామాన్యులకు అండగా ఉంటారని డీసీసీ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లో సామాన్యులు ఇక భూకబ్జా మాఫియాల భయం లేకుండా జీవించవచ్చంటూ ఆయన ప్లకార్డులతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. స్థానిక భగత్ నగర్‌లోని భగత్ సింగ్ చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ శ్రేణులతో థాంక్యూ పొన్నమన్న.. థాంక్యూ కాంగ్రెస్.. అనే ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం సుజిత్‌కుమార్ మాట్లాడుతూ నిజాయితీ కలిగిన నాయకుడు మంత్రి అయితే సమర్థవంతమైన పాలన అందిస్తారనేదానికి పొన్నం నిదర్శనమన్నారు. గతంలో మంత్రిగా ఉన్న గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్ భూకబ్జాదారులకు, మాఫియాకు అండగా నిలిచారని విమర్శించారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు గడ్డం విలాస్ రెడ్డి, శ్రీనివాస్, సిరికొండ ప్రసాద్, దన్ను సింగ్, జేరిపోతుల వాసు, నెల్లి నరేష్, మెతుకు కాంతయ్య, పోరండ్ల రమేష్, జ్యోతి రెడ్డి, ముల్కల కవిత, గంగుల దిలీప్, గోపాల్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 29: హైదరాబాద్‌లోలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన గోజిరాయ్ విద్యార్థులు 18 మంది పాల్గొని పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారని గోజిరాయ్ కరాటే అకాడమి చీఫ్ అన్వర్‌ఖాన్ తెలిపారు. అండర్-12 విభాగంలో సయ్యద్ శేజ సాదత్, జోయా, ఆనంద్, ఆదిబా, బి సాయి, జగదీశ్, ఎం ప్రణవ్, వరుణ్, అక్షిత్, అఖిల్, అండర్-14 విభాగంలో సందాఉన్నతి, కౌసర్, సహాసుల్తానా, అండర్-17 విభాగంలో ఆర్మాన్‌ఖాన్, అండర్-19 విభాగంలో ఆఫ్రాన్ బంగారు, రజిత, కాంస్య పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు. విద్యార్థులకు సినీ హీరో సుమన్ పతకాలను అందించారు. వీరిని మాస్టర్ అక్బర్‌ఖాన్, ఫహిమిదా ఖాతూన్, గీతాంజలి, మౌనిక, శ్రీదేవి, రాజ్‌కుమార్, సాదత్‌అలీ, బి నరేందర్ అభిందించారు.

'అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత రసమయికి లేదు'

గన్నేరువరం, జనవరి 29, మండల అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజల ఆదరణతో గెలుపొందిన కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే నియోజకవర్గం నుంచి తరిమికొడతాం ఖబర్దార్ రసమయి బాలకిషన్ అని మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రసమయి ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవ్వంపల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మైలారం సర్పంచ్ దుడ్డు రేణుకమల్లేశం మాట్లాడుతూ నియోజకవర్గంలోనే అభివృద్ధి పనులు చేయని సర్పంచ్ మైలారం సర్పంచ్ అని మాట్లాడిన నీవు మాకు బిల్లులు రాకుండా మమ్ములను ఏ విధంగా హింసించావో ప్రజలందరికీ తెలుసని రసమయిని విమర్శించారు. మండలం అని పేరు తప్ప మండల అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, బీసిసెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం, సర్పంచులు ముస్కు కరుణాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, జీవన్, రవిందర్, కొమురయ్య ఉన్నారు.

ప్రాంగణ నియామకాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, జనవరి28: స్థానిక శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో నో బ్రోకర్ హండ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కళాశాలకు చెందిన 8మంది ఎంబీఏ-2024 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు 3.2లక్షల రూపాయల వార్షిక వేతనం కంపెనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. సెల్ఫ్ ఇంటర్న్‌షిప్, బ్రాండ్ రీజినల్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వర్లు, విభాగాధిపతి ఆర్.హరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

గన్నేరువరం, జనవరి 29, మండలంలోని మాధాపూర్ గ్రామానికి చెందిన గొట్టిముక్కుల శ్రీనివాస్(55) ఈ నెల 15న రాత్రి హఠాన్మరణం చెందాడు. నిరుపేద కుటుంబమైన తనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబం నిస్సహాయ స్థితిలో ఉండటంతో తిమ్మాపూర్ మండలం నేదునూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 1981-82 బ్యాచ్ ఏడో తరగతి పూర్వ విద్యార్థులు, ఆనాటి గురువులు కలిసి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు. అందరూ కలిసి రూ.20.600 సమీకరించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు. ఎల్లవేళలా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చిన్ననాటి మిత్రులు, చదువు చెప్పిన గురువులు బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ టీచర్లు హన్మంతరెడ్డి, విద్యాసాగర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి


దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

సుభాష్‌నగర్, జనవరి 29: సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరి యంలో ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి 207 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కరీం నగర్ మున్సిపాలిటీ-23, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం-7, పోలీసు కమిషనర్-5, జిల్లా పంచాయతీ కార్యాలయం-9, కరీంనగర్ ఆర్‌డీవో-19 ఇతర శాఖలకు సంబంధించినవి 128 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్‌డీవో పవన్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం పాల్గొన్నారు.

బల్దియాలో అవినీతిపై విచారణ జరిపించాలి

కరీంనగర్ అర్బన్, జనవరి 29: కరీంనగర్ కార్పొరేషన్ సానిటేషన్ విభాగంలో పబ్లిక్ హెల్త్‌వర్కర్లుగా పనిచేస్తూ రోజూ విధులకు హాజరుకాకుండానే లక్షల రూపాయల వేతనాలు పొందుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని అదనపు కలెక్టర్‌కు సోమవారం యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ వర్కర్లు జాబ్‌చార్ట్ ప్రకారం విధులకు హాజరుకావటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, సిరిపురం నాగప్రసాద్, హరీష్ గౌడ్, శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కరీంనగర్ అర్బన్, జనవరి 29: రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో ప్రభుత్వానికి చెందిన సర్వే నెంబరు 792/ఏలోని 2.13 ఎకరాల భూమిని కాపాడాలంటూ సర్పంచ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, వార్డు సభ్యులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 10 సంవత్సరాల నుంచి ఈ భూమిని రక్షించేందుకు ప్రయత్నిస్తుండగా తనపై బీఆర్ఎస్ అక్రమంగా ఎస్సీ ఎస్టీ కేసును పెట్టించిందని ఆరోపించారు. ఈ భూమిని గ్రామంలోని పేదలకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ టౌన్, జనవరి 29: నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయెన్సు (నిసా) నిర్వహించిన నాట్ ఒలంపియాడ్ లెవల్-2 పరీక్షలో పారమిత విద్యార్థి హార్దిక్ గోయల్ జాతీయస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ రితేష్‌మెహతా తెలిపారు. 6,7,8,9వ తరగతుల నుండి కూడా జాతీయస్థాయిలో మొదటి పది స్థానాలకు గాను 12 మంది పారమిత విద్యార్థులు ర్యాంకులు సాధించి నట్లు తెలిపారు. టి.విగ్నేష్, పి.మాన్సీ, జి.సాయిరిషిత్, ఐ.తిలక్, జి.సంతోష్, వి.హర్షిణి, కె.ఆగస్త్యవిస్తృత్, సిహెచ్. వెంకటమోక్షిత్, జి.సహస్ర, ఎం.మనోజ్‌రెడ్డి, ఎ.అశ్విత్‌రెడ్డి ర్యాంకులు సాధించారని అన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్ అనూకర్‌రావు, రశ్మిత అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 29: నగరంలోని ఆలయాల్లో సోమవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్‌రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి, జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు భక్తుల పూజల కోసం ఏర్పాట్లు చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అన్నదాతలకు సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా గాయకురాలు డాక్టర్ సాయికీర్తన పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్**: కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని శ్రీదుర్గాభవాని ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి వేద పండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, హారతి కార్య క్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పవన్ కృష్ణశర్మ, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'అన్ని వర్గాల పోరాట ఫలితమే తెలంగాణ'

భగత్‌నగర్, జనవరి29: సబ్బండ వర్గాల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఉద్యమ గాయకుడు సుక్క రాంనర్సయ్య అన్నారు. సోమవారం నగరంలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద ఫిబ్రవరి 18న నిర్వహించే సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలు, సబ్బండ వర్గాలు, సకల జనులు ఉద్యమంలో పాల్గొని స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. కొంతమంది మేమే ఇచ్చాం, మేమే తెచ్చా అంటు అహంకారంతో మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంపై ఫిబ్రవరి18న హైదరాబాద్‌లో నిజాలు మాట్లాడుకునేందుకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారులు రాపోలు సాంబశివుడు, సాయి బాయ్, రాజు, మహేష్, అజయ్, సదాశివ, శంకర్, యుగేందర్, మురళి, రమేష్, వెంకటేష్, కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎంను విమర్శిస్తే చూస్తూ ఊరుకోం'

కరీంనగర్ అర్బన్, జనవరి29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సీఎంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. నగర కాంగ్రెస్ కార్యా లయంలో సోమవారం విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ఉద్యమం చాటున ఎమ్మెల్యే కావచ్చనే స్వార్థంతో కేకే మహేందర్‌రెడ్డి సీటును గుంజుకుని ఎమ్మెల్యే అయ్యాడని అన్నారు. రేవంత్‌రెడ్డిని అవమానపరిచే విధంగా కేటీఆర్ మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో ఎండీ తాజ్, కొరివి అరుణ్‌కుమార్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, అఖిల్, దన్నసింగ్, కుర్ర పోచయ్య, జీడి రమేష్, ముక్క భాస్కర్, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, లయీక్, చంద్రయ్యగౌడ్, పెద్దిగారి తిరుపతి, మామిడి సత్యనారాయణరెడ్డి, మహమ్మద్ భారీ, బషీర్, నెల్లి నరేష్, సిరాజొద్దీన్, ఖలీల్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధి


కళాశాల పైన ఏర్పాటు చేసిన సోలార్‌సిస్టంను పరిశీలిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 29: కేంద్ర నిధులతో నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో ఎంపీ నిధులతో నిర్మించిన సోలార్‌పవర్‌జనరేషన్ సిస్టమ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం హాస్టల్ నిర్మాణానికి సీఎస్ఆర్ కింద కేంద్ర నిధులు మంజూరు చేయిస్తానన్నారు. సోలార్ పవర్ వల్ల మంచినీళ్లు, కరెంట్ సహా విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందన్నారు. కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలను టాప్ కాలేజీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. సంస్కారం, సంస్కృతి, లక్ష్య సాధన కోసం చదువు కోవాలన్నారు. విదేశీయులు భారత సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలుసు కుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరు దేశం, ధర్మం కోసం పని చేయాలన్నారు.

'అభివృద్ధిపై ఎంపీ సంజయ్ శ్వేతపత్రం విడుదల చేయాలి'

కరీంనగర్ టౌన్, జనవరి 29: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధిపై ఎంపీ బండి సంజయ్ శ్వేతపత్రం విడుదల చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సవాల్ చేశారు. సోమవారం నగరంలోని బీఆర్ఎస్ పార్టీ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో బండి సంజయ్‌కుమార్‌పై విమర్శలు గుప్పించారు. వినోద్‌కుమార్ ఎంపీగా 106 చర్చల్లో పాల్గొనడమే కాకుండా పార్లమెంట్‌లో 553 ప్రశ్నలను సంధించి కరీంనగర్ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని అన్నారు. సంజయ్ ఒక్క ప్రశ్నకూడా పార్లమెంట్‌లో లేవ నెత్తలేదని ఆరోపించారు.

హైకోర్టు విభజన, విద్యుత్ ప్రాజెక్టుల కోసం, జగిత్యాల వరంగల్ జాతీయ రహదారి కోసం వినోద్‌కుమార్ పోరాడారని అన్నారు. ఎంపీగా చొప్పదండికి సంజయ్ ఒక్కసారైనా వచ్చారా ఆలోచించి ప్రజలకు సమాధానమివ్వాలని రవిశంకర్ డిమాండ్ చేశారు.

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, జనవరి 29: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతోనే పరిష్కారం అవుతాయని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ముద్దసాని సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లోని కొంత మంది రైతులకు రైతు బీమా పడడం లేదని ప్రజాప్రతినిధులు సభదృష్టికి తీసుకవచ్చారు. గతంలో చేసిన అభివృద్ధి పనులకు నిధులు రాలేదని, చెరువు శిఖం, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని అన్నారం సర్పంచు బొట్ల కిషన్ తెలిపారు. గట్టుదుద్దెనపల్లిలో విద్యుత్ స్తంభాల సమస్యతో పాటు జాతీయ రహదారి నిర్మాణానికి రోడ్డుకు మట్టి తరలిస్తున్నారని, రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి అదనపు నష్టపరిహారం అందడం లేదని గ్రామ సర్పంచు దేవ సతీష్‌రెడ్డి సభదృష్టికి తీసుకవచ్చారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్లలో కేసీఆర్ నియంతృత్వ పాలన సాగించి ప్రజా సొమ్మును దోచుకుతిన్నారని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. అనంతరం సర్పంచులను పూలమాల శాలువాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దసాని సులోచన, తహశీల్దార్ రాజు, ఎంపీడివో రాజేశ్వర్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేదికపై సీటు తీసివేశారని జడ్పీటీసీ నిరసన

మండల సమావేశంలో ఎమ్మెల్యే, ఎంపీపీ, తహశీల్దార్, ఎంపీడీవో వేదికపై కూర్చుండగా జడ్పీటీసీ సీటు వేదిక కింద ఏర్పాటు చేశారు. దీనిపై జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ ఎంపీటీసీలు పోడియం వద్ద నిరసన తెలిపారు. గతంలో ఎంపీపీ అనుమతితోనే జడ్పీటీసీ వేదిక మీద కూర్చున్నాడని ప్రస్తుతం అలాంటి పద్ధతి కొనసాగించేది లేదని ఎమ్మెల్యే కవ్వంపల్లి చెప్పారు. చట్టంలో ఉన్న విషయాన్ని చదివి వినిపించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌రావును ఎమ్మెల్యే కోరగా ఆయన చదివి వినిపించారు.

బాలల హక్కుల పరిరక్షణ కోసం సహకరించాలి

జమ్మికుంట రూరల్, జనవరి 29: బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరూ సహకరించాలని తహసీల్దార్ రజని అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ సమగ్ర బాలల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో హుజూరాబాద్ సిడిపివో భాగ్యలక్ష్మి అధ్యక్షతన బాలల పరిరక్షణ కమిటీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామ స్థాయి అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యల నిర్మూలన, విద్యా హక్కు చట్టాల గురించి వివరించారు. 18సంవత్సరాల లోపు పిల్లలకు ఏదైనా సమస్య వస్తే పోలీస్‌లు, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, ఎస్ఐ రాజేష్, మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, బాలల పరిరక్షణ అధికారి రమేష్ పాల్గొన్నారు.

57 ఎస్సీ ఉప కులాలను ఆదుకోవాలి

హుజూరాబాద్, జనవరి 29: రాష్ట్రంలోని ఎస్సీ 57 ఉప కులాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సిరిపాటి వేణు అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ ఉప కులాలు 22లక్షల జనాభా ఉందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో ఎస్సీ ఉపకులాలకు 40శాతం ఇళ్లు కేటాయించాలన్నారు. ఎస్సీ ఉపకులాల సంఘానికి ప్రత్యేక కమ్యూనిటీ హాల్ స్థలం, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉప కులాలకు రాయితీలపై రుణాలు ఇవ్వాలన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు


డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

గన్నేరువరం, జనవరి 29, వాణిజ్య పంటలైన డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలను గడించవచ్చని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో రైతులు కల్లెం గంగవ్వ, కల్లెం అంజిరెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటలను డీఆర్‌డీవో శ్రీలతతో కలిసి ఆయన సోమవారం సందర్శించారు. అలాగే జంగపల్లిలో రైతు కర్ర అనూష శ్రీకాంత్‌లు సాగు చేస్తున్న చామంతి, గులాబీ తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో నర్సింహారెడ్డి, ఏపీవో స్వాతి, ఈసీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు శరత్, అశ్విని, రైతులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అక్రమస్తులపై ఏసీబీకి ఫిర్యాదు'

తిమ్మాపూర్, జనవరి29:మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అక్రమంగా సంపాదించిన అస్తులపై న్యాయ విచారణ జరపాలని, ఏసిబితో దర్యాప్తు చేయాలని జిల్లా కలెక్టర్, ఉన్నతధికారులకు ఫిర్యాదు చేస్తామని నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల ప్రజాభవన్(క్యాంప్ కార్యలయంలో) మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి అధ్వర్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మైలారంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు వారి సతీమణి అనురాధ కుటుంబ సభ్యులను పరుష పదజాలంతో అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. ఎంపి ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కరీంనగర్ ఎంపీగా పోటీ చేయబోతున్న వినోద్‌కుమార్ వద్ద తమ ఉనికి చాటుకొని డబ్బుల కోసం ప్రెస్ మీట్‌లు పెడుతున్నాడని, ఎంపీ ఎన్నికల అనంతరం రసమయి బాలకిషన్ కనుమరుగు అవుతాడని ఆరోపించారు. దళితుడై ఉండి దళితుల జాతిని, ఉద్యమకారులను అనిచివేసే కార్యక్రమం రసమయి బాలకిషన్ పెట్టుకున్నాడని, 95శాతంతో సబ్సిడీ ట్రాక్టర్‌ను దళితుల నుంచి తీసుకున్నాడని అన్నారు. రాబోవు రోజుల్లో దళితులే నీకు బుద్ధి చెబుతారని ఆరోపించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం, ఇల్లంతకుంట, కేశవ పట్నం, బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ టౌన్, జనవరి 29: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ రిజర్వాయర్ పరిధిలోని అంబేద్కర్ వాటర్ ట్యాంకు మేయిన్ పైపులైన్ లీకేజీ అయినందున వాటిని మరమ్మతు చేసేందుకు 2,3,4,5,24,25,26,27,28,42,44వ డివిజన్లలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఆయా డివిజన్ల ప్రజలు పొదుపుగా నీటిని వాడుకోవాలని కోరారు.

నేడు భగవద్గీత పారాయణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 29: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు గాంధీరోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గీతాభక్త సమాజం సభ్యులచే శ్రీమద్భగవద్గీత పారాయణం ఉంటుందని అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్య నిర్వాహకుడు ఉప్పల రామేశం ఒక ప్రకటనలో తెలిపారు.

అలయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

సుభాష్‌నగర్, జనవరి 29:అలయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అసోసియేషన్ అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ పిన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ క్లబ్ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలయన్స్‌క్లబ్ సేవలు హర్షనీయ మన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, సిద్దుల బాలకృష్ణ, జిల్లా గవర్నర్ నాగేశ్వర్, వైస్ గవర్నర్లు చీకోటి శ్రీనివాస్‌గాంధి, చెరిమల వెంకటేశ్వర్లు, పులాల్‌శ్యామ్, వరుణ్‌భూపతి, ఎం.విద్యాసాగర్‌రెడ్డి, కొంజర్ల మహేశ్, గామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్పంచులకు సన్మానం

కరీంనగర్ రూరల్, జనవరి 29: కొత్తపల్లి మండలంలోని సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున ఎంపిపి పిల్లి శ్రీలతమహేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిఓ శ్రీనివాస్; ఎపిఓ స్పందన, సర్పంచులు, ఎంపీటీసీలు కొమ్ము హేమలత, పండుగ గంగమ్మ, పెట్టెంశారద, భూక్య తిరుపతి నాయక్, కో-అప్షన్‌సభ్యులు మహ్మద్ షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు ఎం శ్రీనివాస్, ఎం అఖిల్, జి లచ్చయ్య, టి గురువయ్య కె నరేష్, బి శ్రవణ్‌కుమార్, ఎ అభినవ్, డిసుస్మిత పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

భగత్‌నగర్, జనవరి 29: బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు కావడం పట్ల నగరంలోని టవర్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బిహార్ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు సందర్భంగా బీజేబీ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండ రమణారెడ్డి, అనూప్‌కుమార్, కటకం లోకేష్, అవు దుర్తి శ్రీనివాస్, హరిశంకర్, లడ్డు ముందాడా, రాయిరాము, హరిప్రసాద్, సందీప్, అడిచెర్ల రాజు, తణుకు సాయికృష్ణ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలి

సుభాష్‌నగర్, జనవరి 29: డబుల్ బెడ్‌రూం ఇంటిని మంజూరు చేయాలని శాషాషబ్ స్ట్రీట్‌కు చెందిన ఆటో కార్మికుడు మహ్మద్ ఖాలిద్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆటో నడుపుకుంటు తన కుటుంబాన్ని పోషిస్తున్నానని తెలిపారు. తనకు స్వంత ఇల్లు లేదని, అద్దె కట్టే పరిస్థితిలో లేనని ప్రభుత్వం తనకు డబుల్ బెడ్రూము ఇంటిని మంజూరు చేయాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎంపీగా విద్యావంతుడిని ఎన్నుకోవాలి

కరీంనగర్ టౌన్, జనవరి29: విద్యావంతుడు, సమర్థుడైన నాయకుడిని ఎంపీగా ఎన్నుకోవాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగ రాజు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ద్యావ మధుసూధన్‌రెడ్డి, సత్తినేని శ్రీనివాస్, గవ్వ వంశీధర్‌రెడ్డి, బండ వేణు, సాయికృష్ణ, ప్రదీప్, శ్రావణ్, తరుణ్, యశ్వంత్, ఓంకార్, స్వామి, పరుశరాం, సందీప్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బొడిగ శోభకు మంత్రి పొన్నం పరామర్శ

సైదాపూర్, జనవరి 29: బొడిగ శోభ భర్త బొడిగ గాలన్న ఇటీవల మృతి చెందగా సోమవారం సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లిలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సంతాప సభకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై పరామర్శించారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బీజేపీ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జేఎస్ఆర్ తదితరులున్నారు.

చొప్పదండి : మండలంలోని కొలిమికుంటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సత్తు మల్లేశంను సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ పరామర్శించారు. ఇటీవల సత్తు మల్లేశం తండ్రి అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కొలిమికుంటకు వచ్చి మల్లేశంను పరామర్శించారు.

జాతర పనులు పరిశీలించిన చైర్మన్

జమ్మికుంట, జనవరి 29: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపట్నంలో శ్రీసమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు సోమవారం పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్ పాతకాల రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

జమ్మికుంట, జనవరి 29: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ వార్డు సభ్యుడు తుడి రవిచందర్ సోమవారం ప్రజావాణిలో స్పెషల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చొప్పదండి, జనవరి 29: చొప్పదండి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్టల వెంక టేశ్, ఉపాధ్యక్షులు చీకట్ల వీరయ్య, కార్యదర్శిగా పిట్టల రాజ్‌కుమార్, డైరెక్టర్లుగా నని చందు, పిట్టల నర్సయ్య, పిట్టల అంజయ్య, చిల్ల కనుకయ్య, గనవేని రాము, చిల్ల సంతోష్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

హుజూరాబాద్, జనవరి 29: హుజూరాబాద్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 8,9వ తరగతి విద్యార్థులకు సోమవారం ఆంగ్లంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో నర్సింహారెడ్డి హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు వారు బహుమతులను అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో కేసులో రిమాండ్

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెంది న నల్లవెల్లి తిరుపతిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు కాగా విచారణ చేసిన ఏసీపీ జీవన్‌రెడ్డి సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు సన్మానం

వీణవంక జనవరి29: మండలానికి నూతనంగా డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాయబ్ తహశీల్దార్ నిజాముద్దీన్‌ను మండల రేషన్ షాప్‌ల డీలర్ల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.